● సంస్కృత వర్సిటీలో

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టు

● విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో పోలీసుల చర్య
● ఒడిశాలో బాధితురాలి వాంగ్మూలం రికార్డు


లక్ష్మణ కుమార్


ఎ.శేఖర్‌రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మణకుమార్, డాక్టర్ శేఖర్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణకుమార్ ఇటీవల తన ఆఫీసు గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే విభాగంలోని మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.శేఖర్‌రెడ్డి సంఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియో తీసి ఆ విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేశాడు. దీనిపై వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మురళీ మోహన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ భక్తవత్సలంను ఎస్పీ సుబ్బరాయుడు నియమించారు. ఇక, వెస్ట్ సీఐ మురళీమోహన్, అలిపిరి ఎస్ఐ అజిత, మరో నలుగురు మహిళా కానిస్టేబుళ్ల బృందం రెండు రోజుల కిందట ఒడిశా వెళ్లి.. బాధితురాలి వాగ్మూలం రికార్డు చేశారు. మరోవైపు ఘటనా స్థలం పరిశీలన, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలం ఆధారంగా కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్లు 63,68 కింద చేర్చారు. మహిళల భద్రత, రక్షణ పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని ఎస్పీ చెప్పారు.





తిరుపతి - షిర్డీ వీక్లీ రైలు ప్రారంభం

తిరుపతి, సాయినగర్ షిర్డీ.. ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య అనుసంధానం పెరిగేలా, భక్తుల సౌకర్యార్థం వీక్లీ రైలును ప్రారంభించారు. ఢిల్లీ నుంచి మంగళవారం కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న వర్చువల్‌గా ప్రారంభించగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. అదే సమయంలో తిరుపతిలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దనరెడ్డి, రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తుడా మాజీ చైర్మన్ జి.నరసింహయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రైల్వే సీఈ సూర్యనారాయణ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, డిప్యూటీ సీఈ వామనమూర్తి, సీపీఆర్‌వో ఎ.శ్రీధర్, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి ఎన్నో రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నామని, ప్రధానంగా విజయవాడ- గూడూరు మధ్య మూడో రైలు మార్గం పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి సోమన్న వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు రూ.312 కోట్లతో జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్/గూడూరు-రేణిగుంట మూడవ లైను, నడుకుడి-శ్రీకాళహస్తి రైలు మార్గాల పనులు జరుగుతున్నాయని వివరించారు.

- తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి

అయ్యో.. దేవుడా!

తడుకుపేట వద్ద ఢీకొన్న కార్లు

అక్కడికక్కడే ముగ్గురి దుర్మరణం

● మృతుల్లో ఇద్దరు తిరుచానూరు పోటు కార్మికులు.. మరొకరిది చెన్నై
● తిరుత్తణి నుంచి వస్తుండగా ప్రమాదం


ప్రమాదంలో నుజ్జయిన కార్లు


మృతులు శంకర సుబ్రహ్మణ్యం, సంతానం (ఫైల్ ఫొటోలు)

నగరి/తిరుచానూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి వారం లాగే ఈ మంగళవారమూ సుబ్రహ్మణ్య స్వామి దర్శనానికని తిరుత్తణికి బయలుదేరారు. చిత్తూరు జిల్లా నగరి మండలం తడుకుపేట వద్ద వీరి కారు.. ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొన్నాయి. రెండు కారుల్లోని ముగ్గురు దుర్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలోని పోటు కార్మికులు కాగా, మరొకరు చెన్నైవాసి. పోలీసుల కథనం మేరకు.. తిరుచానూరు సమాజం వీధికి చెందిన శంకర్ సుబ్రహ్మణ్యం(50) పద్మావతి అమ్మవారి ఆలయంలో రెగ్యులర్ పోటు వర్కరు. వసుంధర నగర్‌కు చెందిన ఎస్.సంతానం(38) ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ మంచి స్నేహితులు. ప్రతి మంగళవారం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లేవారు. ఈ క్రమంలోనే కారులో తిరుత్తణికి బయలుదేరారు. నగరి మండలం వీకేఆర్ పురం-తడుకుపేట మధ్య చెన్నై నుంచి తిరుమలకు వస్తోన్న కారును మితిమీరిన వేగంతో వీరి కారు ఢీకొంది. ఈ తీవ్రతకు తిరుచానూరు నుంచి వెళుతున్న కారు రోడ్డుకు అవతల ఉన్న లోతట్టు ప్రాంతంలో ఎగిరి పడిపోగా సంతానం, శంకర సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందారు. చెన్నై నుంచి వచ్చే కారు దెబ్బతిని రోడ్డుపైనే ఆగిపోగా.. అందులోని చెన్నై మేడంబాక్కం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్(40) దుర్మరణం చెందారు. అరుణ్‌కుమార్ భార్య తమిళ సెల్వి(36), మేనల్లుడు మదన్(40), కుమారుడు యశ్వంత్(11) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించాక చెన్నైలోని తాంబరం ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ తుషార్ డూడి, డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ప్రమాద కారణాలను సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ నాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం తరువాత మృతదేహాలను బంధువులకు పోలీసులు అప్పగించారు. మంగళవారం సాయంత్రానికి సంతానం, శంకర సుబ్రహ్మణ్యం మృతదేహాలు తిరుచానూరుకు చేరుకోగా టీటీడీ అధికారులు, ఆలయ ఉద్యోగులు, స్థానికులు నివాళులర్పించారు. శంకర్‌కు ఇద్దరు కుమారులు.. సంతానంకు పాప, బాబు ఉన్నారు. ఈ రెండు కుటుంబాల్లో విషాదంనెలకొంది. ఈ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి రాంప్రసాదరెడ్డి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. పోటు కార్మికుల మృతి విషాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా అధికారులతో నేడు డిప్యూటీ సీఎం మాటా మంతి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి శాఖలో డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్‌అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైళ్లకు మోక్షం కల్పించారు. గ్రేడ్ 4 కార్యదర్శి నుంచి డిప్యూటీ ఎంపీడీవోల వరకు పదోన్నతి కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రంలోని జడ్పీ సీఈవోలు, డీపీవోలు, పీడీ డ్వామా, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీడీవోలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటా మంతి నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌లో యాక్షన్‌ప్లాన్ అలాగే గ్రామాణాభివృద్ధికోసం అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. దీనికోసం జిల్లా నుంచి డీపీవో సుశీలాదేవి, డిప్యూటీ ఎంపీడీవోలు, డీడీవోలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలనుంచి సుమారు 70మంది మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు.

డిగ్రీ పరీక్షల వాయిదాపై వదంతులు నమ్మకండి


● అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షల వాయిదాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆ వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం సూచించారు. ఈ నెల 9 వ తేదీన జరగాల్సిన పరీక్ష 14 వ తేదీ నిర్వహిస్తామన్నారు. 10 నుంచీ జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా చేపడతామన్నారు. పరీక్షల వాయిదాపై కొందరు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. పరీక్షల వాయిదాపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

20.30 గంటలు.. 203 కిలోమీటర్లు

● స్కేటింగ్‌లో అంధ విద్యార్థి రికార్డు


పతకాలు, ధ్రువపత్రాలు అందుకుంటున్న హర్షవర్ధన్



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రం

తిరుపతి(క్రీడలు)/వడమాలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కంటి చూపులేదు. కానీ స్కేటింగ్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. 20.30 గంటల్లో 203 కిలోమీటర్లు స్కేటింగ్ చేశాడు. సోమవారం ఉదయం చిత్తూరుజిల్లా నంగిలిలో మొదలైన స్కేటింగ్ యాత్ర.. గంటకు దాదాపు 15 కిలోమీటర్ల వేగంతో సాగింది. మధ్యలో మూడు సార్లు బ్రేక్ తీసుకున్నాడు. ఇలా మంగళవారం వేకువజామున 2.30 గంటలకు వడమాలపేట మండలంలోని ఎస్వీపురం టోల్ ప్లాజా గమ్యస్థానానికి హర్షవర్ధన్ చేరుకున్నాడు. మంగళవారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హర్షవర్ధన్ యాత్రను ప్రత్యక్షంగా రికార్డుచేసిన న్యాయనిర్ణేతలు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఏపీ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, జీనియస్ బుక్ ఆఫ్‌రికార్డ్ నుంచి శ్రీనివాసరావు, విశ్వచంద్రారెడ్డి, వజ్రవరల్డ్ రికార్డ్ నుంచి పి.హరిణి ద్వారా ఆ బాలుడికి పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. పలువురు దాతలు ఆర్థికసాయం అందించారు. మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కాపుకార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు శశిధర్, ఉదయ్‌భాస్కర్, స్కేటింగ్ కోచ్‌లు ప్రతాప్, ప్రేమ్‌నాథ్, శాప్ కోచ్‌లు లక్ష్మీకరుణ, చక్రవర్తి, హిందూజ, వినోద్, నాగరాజు, గోపీ, సాయిసుమతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 16 ఏళ్ల విద్యార్థినిపై ర్యాపిడో ఆటో డ్రైవరు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. అనంతపురానికి చెందిన విద్యార్థిని తిరుపతిలోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల ఆమె హాస్టల్ మారారు. పుస్తకాలు, చిన్న చిన్న పాత్రలు తీసుకెళ్లేందుకు ర్యాపిడో ఆటో బుక్ చేశారు. ఆమె మొబైల్ నెంబరు కర్నూలుకు చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్ (ప్రస్తుతం తిరుపతిలో ఉన్నాడు) వద్ద సేవ్ అయింది. దీంతో అతడు ఆమెకు పలుమార్లు ఫోను చేశాడు. కొంత కాలంగా వీరి మధ్య పరిచయం పెరగింది. తనకు అత్యవసరమై ఆమె ఆటో డ్రైవర్‌ను డబ్బు అడిగింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఆటో డ్రైవర్.. ఆమెను మభ్యపెట్టి తన గదికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈనెల 2న సాయంత్రం ఫోన్ చేసి పిలిపించాడు. ఆటోలో శివారు ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి బెదిరింపులకు భయపడి ఆమె ఎవరికీ చెప్పలేదు. చివరకు తన స్నేహితురాలితో కలసి సోమవారం రాత్రి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద సాయి కుమార్‌పై సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు. అతడి ఆటో నెంబరు కోసం ఆమె ఉన్న పాత, కొత్త హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ఎస్పీ సుబ్బరాయుడు మూడు బృందాలను నియమించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఐ రాజాపవన్‌కుమార్

భాకరాపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలయంలో హుండీ చోరీ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. భాకరాపేట ఎస్ఐ రాజాపవన్‌కుమార్ కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టివారిపాళెం పంచాయతీ నల్లపురెడ్డిగారిపల్లెలోని రామాలయం, వినాయక స్వామి ఆలయం లో ఈ నెల 6వ తేదీన రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీలు పగలగొట్టి నగదు చోరీ చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈనెల 8న భాకరాపేట బస్టాండు వద్ద అను మానాస్పదంగా తిరుగుతున్న చట్టివారిపాళెం పంచాయతీ నీరుగుట్ట హరిజనవాడకు చెందిన చిత్తూరు మనోహర్, చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన వెలిగారం వెంకటేశులును అదుపు లోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించారు. వీరి నుంచి రూ.16,475లు రికవరీ చేశారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండు విధించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

భాకరాపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి కేడీ సారధి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలలో జరుగుతున్న 100 రోజుల ప్రోగ్రాంలో భాగంగా జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రభుత్వం విద్యా శక్తి పేరుతో 100 రోజుల ప్రణాళిక రూపొందించిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల ఆధారంగా వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

చంద్రగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవమైంది. మంగళవారం చంద్రగిరిలో యూటీఎఫ్ సమావేశం జరిగింది. యూటీఎఫ్ మండలాధ్యక్షుడుగా పి.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ధనంజయ, గౌరవాధ్య క్షులుగా కె.రామిరెడ్డి, సహాఅధ్యక్షులుగా లక్ష్మి, చెంచయ్య, కోశాధి కారిగా డి.శ్రీరాములు, సభ్యులను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మజ వ్యవహ రించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నిర్మల, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

శానంబట్లలో ఎస్పీడబ్ల్యు యూనివర్శిటీ విద్యార్థినుల శ్రమదానం



స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కల్పిస్తున్న కళాజాత కళాకారులు

చంద్రగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శానంబట్ల గ్రామంలో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీలోని హోమ్ సైన్స్ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-17 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ ఆధ్వర్యంలో వలంటీర్లు మంగళవారం శ్రమదానం నిర్వహించారు. గ్రామంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. అనంతరం కళాజాత కళాకారులచే స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్లాస్టిక్ నిషేధం, అంటువ్యాధుల నుంచి సంరక్షణ, తదితర వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి హరిత గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు



పాకాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారి పాకాల మండలం తోటపల్లెవద్ద మంగళవారం సాయంత్రం ఓ కారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్తున్న కారుకు తోటపల్లె వద్ద ఓ వ్యక్తి అడ్డురావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొనడంతో ట్రాన్స్‌ఫార్మర్ కిందపడింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తుఅందులో ప్రయాణిస్తున్న భరత్, తేజ గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదరికాన్ని జయించాలి



మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు

రామచంద్రా పురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి సమాఖ్య ఆదర్శం గా రూపొందాలని పేదరికాన్ని జయించాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. రామచంద్రాపురం వెలుగు కార్యాలయంలో ఆదర్శ గ్రామం, మండల సమాఖ్యలు ఏ విధంగాఉండాలి అనే విషయంపై మండల సమాఖ్య కార్యనిర్వాహక కమిటీ సభ్యులకు నాలుగురోజుల శిక్షణ మంగళవారం ప్రారంభించారు. పేదరికానికి గల కారణాలు, వాటిని అధిగమించ డానికి తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై సభ్యులను గ్రూపులుగా ఏర్పాటు చేసి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, సీసీలు పార్వతమ్మ, సుధాకర్, అరుణ, అకౌంటెంట్ స్వర్ణలత, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠద్వార దర్శన టోకెన్ల స్థానికుల కోటా వాయిదా

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల స్థానికుల కోటాను టీటీడీ వాయిదా వేసింది. డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయి. ఈక్రమంలో ఇప్పటికే తొలి మూడు రోజులకు సంబంధించిన టోకెన్లను ఈ-డిప్ ద్వారా కేటాయించిన టీటీడీ మిగిలిన ఏడు రోజుల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణిటికెట్లను కూడా ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసింది. కాగా చివరి మూడురోజుల్లో రోజుకు 5 వేల చొప్పున 15 వేల టోకెన్లు తిరుపతి, తిరుమల స్థానికులకు డిసెంబరు 10వ తేదీన విడుదల చేస్తామని టీటీడీ ప్రకటించింది. అయితే ప్రత్యేక అప్లికేషన్ రూపకల్పనతో కొన్ని ఇబ్బందులు తలెత్తిన క్రమంలో కోటా విడుదలను తాత్కాలికంగా వాయిదా వేశారు. మరోవారం రోజుల్లోగా అప్లికేషన్‌ను సిద్ధం చేసి కోటాను విడుదల చేయనున్నారు.

ఫోరం తనిఖీలతో మంచి ఫలితాలు

ఎర్రావారిపాళెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యా అభివృద్ధి ఫోరం తనిఖీలతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఎంఈవో బాలసుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండలంలోని ఉదయ మాణిక్యం మోడల్ ప్రైమరీ స్కూలులో మండల అకాడమిక్ ఫోరం సభ్యులు తనిఖీలు చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం రెడ్డివారిపల్లె, తొగటపల్లె పాఠమిక పాఠశాలను ఫోరం సభ్యులు తనిఖీ చేశారు. ఈ తనిఖీ బృందంలో ఎంఈవో-2 సతీష్ బాబు, టీచర్లు అలియాబేగం (ఆంగ్లం) సిద్ధయ్య (తెలుగు), రమేష్ (గణితం), హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యా యులు జయరాం, నరేంద్ర, సుజాత, అబ్దుల్ బహిత్, రోజా పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతలో ఔషధ నియంత్రణాధికారుల పాత్ర కీలకం

- రుయా ఆవరణలో నూతన డ్రగ్ కంట్రోల్ కార్యాలయం ప్రారంభం



డ్రగ్ కంట్రోల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిషేధిత ఔషధాల విక్రయాలను అరికట్టడంతోపాటు నాణ్యమైన వాటిని ప్రజలకు అందించి వారి ఆరోగ్య భద్రతలో ఔషధ నియంత్రణాధికారుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 డ్రగ్ కంట్రోల్ నియంత్రణ కార్యాలయాలను, రెండు రీజనల్ డ్రగ్ టెస్టింగ్ లేబరేటరీస్‌లను అమరావతి నుంచి వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ క్రమంలో తిరుపతి రుయాస్పత్రి ఆవరణలో నిర్మించిన డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సహాయ సంచాలకుల నూతన భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రోగులకు చికిత్స తర్వాత వారు పూర్తిగా కోలుకోవాలంటే మందులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. అటువంటి ఔషధాల విక్రయ విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఇప్పటి వరకు సొంత భవనం లేక ఇబ్బంది పడ్డారన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ. 81.60 లక్షలతో వారికి అవసరమైన నూతన భవనాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీమునికృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వరప్రసాద్, డీఐవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఏడు గంగమ్మల జాతర

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వేడుకగా జరగనుంది. ఇందుకోసం ఆయా ఆలయాల నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

అమ్మో ..కొండచిలువ

- వెంటాడుతున్న చిరుత భయం.. మంగళవారం కనిపించిన కొండచిలువ
- వెటర్నరీలో ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, విద్యార్థులు



బాలికల వసతిగృహాలకు సమీపంలో రహదారిని దాటుతున్న కొండచిలువ

తిరుపతిరూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీలో ఓపక్క చిరుత సంచార భయం వెంటాడుతుండగా.. మరోపక్క సర్పాల బెడదతో వర్సిటీ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే దాదాపు రెండు నెలలుగా చిరుత, దానిపిల్లలు పలు విభాగాలు, వసతిగృహాలు, ప్రధానపరిపాలనా భవనం, అతిథిగృహం తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. దీనికితోడు వర్సిటీ అంతర్గత రహదారులు, విభాగాల వద్ద పలుచోట్ల సర్పాలు సంచరి స్తున్నాయి. తాజాగా మంగళవారం ఉదయం బాలికల వసతిగృహాలకు సమీపంలో ఓ కొండచిలువ రహదారిని దాటుతుండగా విద్యార్థులు గమనించి భయాందోళన చెందారు. ఈ కొండచిలువను పలువురు తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆ వీడియో వర్సిటీ అంతటా వ్యాపించడంతో వైరల్‌గా మారింది. దీంతో చీకటి పడ్డాక విద్యార్థులు బయటకు రావాలంటే వణికిపోతున్నారు. వర్సిటీ అధికారవర్గాలు సైతం విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నాయి. కాగా వెటర్నరీ కళాశాల ప్రాంగణం, వసతిగృహాలు, పలువిభాగాల వద్ద ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, చెట్లని ఇటీవల ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు.

గ్రామాభివృద్ధికి కలసికట్టుగా పనిచేయాలి

- టీడీపీ రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి



కూటమి పార్టీ నేతల సమీక్షల్లో ఈశ్వర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మౌనిక తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీ నేతలందరూ కలసికట్టుగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషిచేయాలని తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దుర్గసముద్రం గ్రామ పంచాయతీలోని పార్టీ నేతలతో మంగళవారం బూత్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టార న్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మౌనికని ఏఎంసీ చైర్ పర్సన్‌గా నియమించారని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కాగా పంచాయతీల్లోని సమస్యలను పలువురు నేతలు పరిశీలకుల దృష్టికి తెచ్చారు. ఆర్‌సీపురానికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లేందుకున్న మార్గంలో రెండువరుసల సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్, మాజీ సర్పంచ్ చిన్ని, బాబురాయల్, రవి, చెంగల్‌రాయల్, చంద్రశేఖర్, సుధాకర్, మోహన్, సురేంద్రరెడ్డి, శంకర్, ఢిల్లీ, చెంగయ్యయాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకరయ్య, టీడీపీ నాయకులు

పాకాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సుధాకరయ్య, సింగిల్ విండో చైర్‌పర్సన్ కె.సావిత్రి, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు అన్నారు. మండలంలోని కె.వడ్డేపల్లె రైతు సేవాకేంద్రాన్ని మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకోసం రాయితీ విత్తనాలు, డ్రిప్ పరికరాలు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తోందన్నారు. రైతు సేవాకేంద్రాల్లో యూరియా పంపిణీ పారదర్శకంగా చేస్తుందన్నారు. మండలంలో యూరియా కొరత లేదని అవసరమైన రైతులందరికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బొల్లినేని మహేష్ కుమార్, మండల టీడీపీ కన్వీనర్ ఫల్గుణ కుమార్, ఆనందగిరి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, నాయకులు టీజే.ప్రవీణ్, బాలాజీ, భరత్, ఆనంద్, గోకుల్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అయ్యప్పల సందడి

ఎర్రావారిపాళెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలు అయ్యప్పభక్తులతో సందడిగా మారాయి. మండలానికి చెందిన దాదాపు 500 మంది అయ్యప్ప భక్తులు ఈ వారంలోనే శబరి మలై యాత్రకు వెళ్లారు.

క్రీడాకారుడికి గీతా గోవిందం సేవా సమితి చేయూత



క్రీడాకారుడు అరవింద్ యాదవ్‌తో గీతా గోవిందం ట్రస్ట్ సభ్యులు

తిరుపతి(ఆటోనగర్),డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అనంతపురం బీసీ హాస్టల్‌లో ఇంటర్ చదువుతూ పరుగు పందెంలో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారుడు ఆవుల అరవింద్ యాదవ్‌కు తిరుపతి గీతా గోవిందం సేవా సమితి నిర్వాహకులు ఆర్థిక సహాయం చేశారు. అరవింద్ యాదవ్‌ది కర్నూలు జిల్లాలోని ఒక కుగ్రామం. అనంతపురం బీసీ హాస్టల్లో చదువుతున్నాడు. ఇతడు పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబరిచేవాడు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయ స్థాయి రన్నింగ్ రేస్‌లో 100, 400 రిలే పోటీల్లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. అయితే అక్కడికి వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేదు. ఈ విషయం తెలుసుకున్న సేవా సమితి సభ్యులు ఆరుగురు కలిసి రూ10,616లు అతడికి అదజేశారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!



శ్రీనివాసమంగాపురం కూడలిలో కుంగిపోయిన మ్యాన్ హోల్స్

చంద్రగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగా పురం ప్రధాన కూడలిలో మదనపల్లె, తిరుపతి జాతీయ రహదారి పక్కన, చంద్రగిరి రోడ్డు వైపు వద్ద అండర్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ కుంగిపోయాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారులు ఆదమరిచి మ్యాన్ హోల్స్‌పై ప్రయాణిస్తే వాహనాలు ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. అంతే కాకుండా పీలేరు, మదనపల్లెకు వెళ్లడానికి ప్రయాణికులు, మోహన్‌బాబు విశ్వవిద్యాలయానికి వెళ్లడానికి విద్యార్థులు వాహనాల కోసం అక్కడే వేచి ఉంటారు. మ్యాన్ హోల్స్ నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులు స్పందించి అండర్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

భవితకేంద్రానికి వాటర్ ప్యూరిఫైర్ విరాళం



వాటర్ ప్యూరిఫయర్, వాటర్ బాటిళ్లని విరాళంగా అందిస్తున్న దాతలు, పక్కన మధుశేఖర్, ఎంఈవో-1 పద్మజ

తిరుపతిరూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో భవితకేంద్రం (రూరల్) ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు రూ.19వేల విలువచేసే వాటర్ ప్యూరిఫయర్‌ని, పలువురుదాతలు 60 స్టీల్ వాటర్ బాటిళ్లను మల్లంగుంట సింగిల్‌విండో చైర్మన్ చెరుకూరి మధుశేఖర్, టీడీపీ నేత వైకుంఠం శ్రీధర్‌నాయుడు చేతుల మీదుగా భవితకేంద్రానికి విరాళంగా అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గౌరీశంకరరావు, సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈవో-1పద్మజ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రాల సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. సహిత విద్య టీచర్లు సుప్రజ, ఉష మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కేంద్రంలోని 75 మంది విద్యార్థులకు ప్రభుత్వం అలవెన్స్, ఉచిత ఉపకరణాలు అందించిందని వివరించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యా ర్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. కాగా కేంద్రంలోని పిల్లలకు, వారి తల్లిదండ్రులకు జయ, మోహన్‌రెడ్డి దంపతులు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. జిల్లా సెక్టోరియల్ అధికారులు సురేష్, సారథి, దాతలు శ్రీనివాసులు, సౌజన్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేడుకగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి అన్నమాచార్య కళామందిరం సమీపంలోని షిర్డి సాయిబాబా మందిరంలో 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కనులపండువగా జరిగాయి. మందిరంలో ప్రత్యేక పూజలు చేసి కర్పూర హారతులు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటం ఊరేగింపు నగర వీధుల్లో వేడుకగా జరిగింది. డప్పు వాయిద్యాలు, భజనలతో శోభాయ మానంగా ఊరేగింపు సాగింది. ఆలయ గౌరవా ధ్యక్షులు మబ్బు దేవనారాయణరెడ్డి, అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు గుండాల గోపీనాధ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నబాబు

రామచంద్రాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి రైతుల సంక్షేమం, పాడి పశువుల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చిన్నబాబు అన్నారు. మంగళవారం సి.రామాపురంలో గోకులమిషన్‌లో భాగంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేస్తోందన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ జయకిషోర్, భువనేశ్వరి, వరజకుమారి సుమారు 55పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. పిడుదల నివారణ కోసం మందులను పిచికారి చేశారు. 30 దూడలకు నట్టల నివారణకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, రామిరెడ్డి, పశువైద్య సిబ్బంది సురేంద్ర, నీలిమ, పృథ్వీ, సురేంద్ర, పాడి రైతులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలిక(17) అదృశ్య మైనట్లు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాలికతో పొరుగు గ్రామానికి చెందిన యువకుడు సన్నిహితంగా ఉండేవాడని రెండు రోజుల నుంచి ఇద్దరు కనబడడం లేదని కుటుంబసభ్యులు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయ కుండా పోలీసులు జాప్యం చేయడంతో బాలిక కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా రు. దాంతో బాలిక అదృశ్యమైనట్లు రాత్రి కేసు నమోదు చేశారు. ఆ వెంటనే యువకుడితో పాటు బాలికను పోలీసులు శ్రీకాళహస్తికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

మధురమలై కొండకు చేరిన ఏనుగులు



ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి, టమోటా తోటలు

సోమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం నెలుకూరివారిపల్లె సమీపంలో టమోటా, వరి పంటల్లో స్వైరవిహారం చేసి బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. మంగళవారం పగలే మధురమలై కొండ వద్ద ఏనుగులు సంచరించడంతో పశువులను మేత పట్టుకెళ్లడానికి అడవి వైపు రావడానికి రైతులు ఇబ్బందులుపడ్డారు. కాగా ఆవులపల్లె పంచాయతీలోని ఒంటరి ఏనుగు ఇళ్లపల్లెకు చెందిన ఊసన్న వరి పొలంలో తిరగాడి పంటను ధ్వంసం చేసింది. రైతులు ఎంతో ఖర్చు చేసి సాగుచేసి కోతకు సిద్ధంగా ఉన్న వరి, టమోటా తోటల్లో గజరాజులు స్వైరవిహారం చేసి పంటలను తొక్కివేయడంతో కడుపు కోత మిగులుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు జట్లుగా ఏర్పడి సొంత ఖర్చులతో టపాసులు పేల్చుకుంటూ, డప్పుల శబ్ధం చేస్తున్నామన్నారు. మరికొందరు పొలాల వద్దనే మంటలు వేసుకొని జాగరణ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంటపొలాలపై ఆగని గజదాడులు



ధ్వంసమైన అరటి చెట్లను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

యాదమరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోడబండ్ల బీట్ పరిధిలోని తాళ్ళమడుగు, ఎగువ పాత పాళ్యం, దళవాయిపల్లె గ్రామాల్లో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. భూమిరెడ్డిపల్లె సమీపంలోని నుంజర్ల అటవీ ప్రాంతంలో 13 ఏనుగులు గుంపులుగా విడిపోయి అరటి, మామిడి, టెంకాయ (కొబ్బరి) చెట్లు, వరిపంటలను నాశనం చేశాయి. ఎగువ పాత పాళ్యం అటవీప్రాంతం వద్ద వరి, కొబ్బరి, మామిడి, అరటిపంటలను పూర్తిగా నాశనం చేశాయని బాధిత రైతులు రైతులు ప్రసాద్, వెంకటేష్ యాదవ్, సుబ్రహ్మణ్యం, శ్రీనులు వాపోయారు. చలితీవ్రత తక్కువగా ఉండటం, దట్టమైన అడవి కావడంతో ఏనుగుల గుంపు ఈ ప్రాంతాన్ని వీడటంలేదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఎఫ్ఎస్‌వో మోహన్‌మురళి, ఎఫ్‌బీవో ప్రతాప్ పంటలను పరిశీలించారు.

తిరుపతి

రేపు జనసేన జనవాణి

తిరుపతి అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల ఆధ్వర్యంలో గురువారం జరగనుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. పలు విభాగాల అధికారులు, జనసేన డివిజన్ల అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొంటారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు విశ్వంలో ఉచిత నవోదయ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

తిరుపతి(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం పాఠశాలలో ఉచిత నవోదయ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్ గురువారం నిర్వహించనున్నట్టు విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు గాను ఈనెల 13వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. నమూనా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802/9399976999 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని వివరించారు.

టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌లో సమస్యలు తీర్చండి


భానుప్రకాశ్‌రెడ్డిని సత్కరిస్తున్న టీటీడీ కాంప్లెక్స్ అసోసియేషన్ నాయకులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బోర్డు సభ్యులు భాను ప్రకాశ్‌రెడ్డికి షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు. స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్ వద్దకు మంగళవారం విచ్చేసిన ఆయనను అసోసియేషన్ నాయకులు కలిసి విన్నవించారు. ఎస్వీ కాంప్లెక్స్, పురందరదాస్ కాంప్లెక్స్, డీఆర్‌మహల్ కాంప్లెక్స్‌లలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వచ్చేబోర్డు సమావేశంలో ఈసమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందు భానుప్రకాశ్‌రెడ్డిని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

చిన్నారులకు మెకానిక్ అసోసియేషన్ చేయూత



తిరుపతి(జీవకోన), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని లక్ష్మీపురంలో ఉన్న అంగన్వాడీ ప్రైమరీ పాఠశాలకు తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిలిండర్, స్టవ్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. అదేవిధంగా చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి, గౌరవాధ్యక్షుడు జలందర్, కార్యదర్శి గురు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణమూర్తి తేజ చారిటీస్ ఫౌండేషన్ దినోత్సవం


మాట్లాడుతున్న చదలవాడ కృష్ణమూర్తి

తిరుపతి(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీవీఎస్ కృష్ణమూర్తి తేజ చారిటీస్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం స్థానిక రేణిగుంట రోడ్డులోని చదలవాడ విద్యాసంస్థల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి దివంగత శ్రీనివాసతేజ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్‌చేసి ఫౌండేషన్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణతేజ విద్యాసంస్థల్లో అత్యుత్తమ బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న అధ్యాపకులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, కళాశాలకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విద్యాసంస్థలను నెలకొల్పనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా విభాగాధిపతులను సన్మానించారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు, పారిశుధ్య సిబ్బందికి చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యాసంస్థల కోఛైర్మన్ వరుణ్‌సాయి, సీవీఎస్ కృష్ణమూర్తి తేజ చారిటీస్ ఫౌండేషన్ ట్రస్టీలు సుమలత, కవిత, సాహితి, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ


ఆకుతోట వీధిలో నిర్వహించిన నడివీధి గంగమ్మ ఉత్సవంలో స్థానికులతో కలిసి అంబలి పంపిణీ చేస్తున్న బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి, పాన్నాల చంద్ర తదితరులు

పారిశుధ్య పర్యవేక్షణ ఇదేనా?

శానిటరీ సెక్రటరీపై కమిషనర్ ఆగ్రహం - షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశం



తిరుపతి,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'ఇతను ఎవరో మీకు తెలుసా..? రోజూ మీ వార్డుకు వస్తున్నారా? చెత్త తీయిస్తున్నారా? కాలువలు శుభ్రం చేయిస్తున్నారా?" అని 3వ డివిజన్ శానిటరీ సెక్రటరీ బాబు నాయక్‌ను చూపిస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య స్థానికులను అడిగారు. 'ఆయన ఎవరో మాకు తెలియదని, ఎప్పుడూ చూడలేదని, రోజూ వస్తే ఇలా చెత్త ఎందుకు ఉంటుంది' అని స్థానికులు సమాధానం ఇవ్వడంతో కమిషనర్ శానిటరీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌లో తరుచూ 3వ డివిజన్ పారిశుధ్యానికి సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో మంగళవారం లక్ష్మీపురం, జయనగర్, మున్సిపల్ ప్రైమరీ స్కూల్ తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అక్కడి పారిశుధ్య పరిస్థితి చూసి శానిటరీ సెక్రటరీకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్‌ను ఆదేశించారు. అదేవిధంగా పలుచోట్ల డ్రైనేజీ కాలువలు, రోడ్లపై ర్యాంపులు (మెట్లు) ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త, మురుగునీరు ఆగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్కూల్‌పై వాలిన చెట్టు కొమ్మలను తొలగించాలని ఉద్యానవన శాఖాధికారికి సూచించారు. కమిషనర్ వెంట ఎంఈ తులసికుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, డీఈలు రాజు, లలిత, శిల్ప, ఏసీపీలు మధు, పార్వతిప్రియ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ స్కూల్లో చేరండి



తిరుపతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతులు, నాణ్యమైన విద్య అందిస్తున్న మున్సిపల్ స్కూల్లో చేరాలని నగర పాలక యంత్రాంగం పిలుపునిచ్చింది. విద్యార్థుల శాతం తగ్గిపోతున్న నేపథ్యంలో 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

నడివీధి గంగమ్మకు పొంగళ్లు




తిరుపతి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని నడివీధి గంగమ్మలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టి అంబళ్లు పోశారు. ఇందులో భాగంగా 36వ డివిజన్‌లోని నడివీధి గంగమ్మ ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నేత ఊట్ల సురేంద్రనాయుడు పాల్గొని భక్తులకు అంబళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కూటమి నాయకులు రవిశంకర్ (సుబ్బుయాదవ్), శంకర్ యాదవ్, వినోద్ రాయల్, ప్రేమ్, కృష్ణయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, వరప్రసాద్, ప్రేమ్‌కుమార్, మునిరాయల్, సాయియాదవ్, మహిళా భక్తురాలు, భారతి, ప్రభావతి, వరలక్ష్మి, మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ


ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గత ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తిరుపతి పరిసర ప్రాంతాల్లో అర్హులైన పేదలను గుర్తించి ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. కొందరికిస్థలాలు చూపించిందన్నారు. మరికొందరికి చూపలేదన్నారు. ఆ సమయంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నగరప్రాంతాల వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్ల ఇంటిస్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా సమస్య పరిష్కరించలేదన్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని అది కూడా అమలు చేయలేదని విమర్శించారు. అనంతరం ఆర్‌డీవోకు వినతిపత్రం అందజేశారు. నేతలు విశ్వనాథ్, నదియ, రత్నమ్మ, సి.కాళయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యసేవలు ప్రపంచ వ్యాప్తం చేస్తాం


డాక్టర్ రవిచంద్రారెడ్డి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మన దేశ సంప్రదాయ వైద్యమైన ఆయుష్ వైద్య సేవలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు చేరువ చేసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రయత్నం చేస్తోందని హోమియోపతి శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పాత ప్రసూతి ఆస్పత్రిలోని హోమియోపతి ఆస్పత్రిలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆయుష్ వైద్యసేవలను ప్రపంచవ్యాప్తం చేసేందుకు ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఢిల్లీలో 2వ గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గతంలో గుజరాత్‌లో నిర్వహించిన మొదటి గ్లోబల్ సమ్మిట్ ఎంతో విజయవంతమైందన్నారు. ఇప్పుడు నిర్వహించే రెండవ సమ్మిట్‌లో కూడా చక్కటి ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులువిచ్చేసి ఆయుష్ వైద్య సేవల ప్రాముఖ్యతను వివరిస్తారని పేర్కొన్నారు. ఆయుష్ వైద్యాన్ని ప్రజలకు చేరువచేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారన్నారు. తిరుపతిలోనూ ఆయుష్ ఆధ్వర్యంలో ప్రజలకు చక్కటి హోమియో వైద్యసేవలను అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఎన్ఎంయూ


డీపీటీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ మంగళవారం డీపీటీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టింది. తొలుత తిరుపతి డిపో ముఖద్వారం నుంచి ఎన్ఎంయూ జెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీగా డీపీటీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వి.ఆర్.కుమార్, బీఎస్ బాబు మాట్లాడుతూరేణిగుంట బస్సు టిక్కెట్ బుకింగ్ పాయింట్ వద్ద షల్టర్ వేయాలని, గ్యారేజీ షెడ్లకు మరమ్మతులు చేపట్టాలని, సిబ్బందికి పనిముట్లు ఇప్పించాలని, పెండింగ్‌లో ఉన్న నూతన చార్టులు వేయాలని, సీనియారిటీ ప్రకారం ఓడీలు వేయాలని, సస్పెన్షన్ చేసిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని, స్త్రీశక్తి పథకం ద్వారా పెరిగిన రద్దీ కారణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. 40 రోజులుగా నిరసనలు తెలుపుతుంటే స్పందించకపోవడం దారుణమని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని డీపీటీవోను కోరినా తిరస్కరించడం బాధాకరమన్నారు. ఈ ధర్నాలో జోనల్ నాయకులు సన్యాసిరావు, టి.వి.లక్ష్మి, గుణశేఖర్, సతీష్, ఆర్ముగం పాల్గొన్నారు. కాగా ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నా విరమించాలని కోరారు.

క్రిటికల్ మినరల్స్ టెక్నాలజీపై బీటెక్ కోర్సు అవసరం

● ఎస్వీయూ వీసీ నరసింగరావు


భారతరత్న డాక్టర్ సీఎన్ఆర్ రావును సత్కరిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంలో ఖనిజ సంపద ఎక్కువగా ఉందని, అందువల్ల క్రిటికల్ మినరల్స్ టెక్నాలజీపై బీటెక్ కోర్సు అందించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ వీసీ నరసింగరావు పేర్కొన్నారు. హైదరాబాదు ఐఐటీలో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ క్రిటికల్ మినరల్స్‌పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. అలాగే బెంగళూరులో చేపట్టిన బ్యాటరీ టెక్నాలజీపై సదస్సుకు బ్యాటరీ రీసెర్చ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడి హోదాలో ప్రొఫెసర్ నరసింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ సీఎన్ఆర్ రావును సత్కరించారు.

పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయిన్ల సమస్యలు పరిష్కరించాలి

●వార్డుల్లో కమిషనర్‌తో కలసి పర్యటించిన కోడూరు


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందించారు. అక్కడ నుంచి కమిషనర్‌తో కలసి మూడవ వార్డుతో పాటు పలు కాలనీల్లో పర్యటించారు. శానిటేషన్, చెత్త సేకరణ, శుభ్రత, పారిశుధ్య లోపాలపై ఆరా తీశారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వనరుల కొరత, మురుగునీటి నిల్వలు, రహదారులు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్‌తో పాటు డాక్టర్ కోడూరు బాల సుబ్రహ్మణ్యం, మూడవ వార్డు అధ్యక్షులు నందగోపాల్, ఆనంద్, టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు. ● అలాగే లక్ష్మీపురం కాలనీలో రెండవ కనెక్టివిటీ రూట్ లేని అంశంపై చర్చించి వినతి పత్రం అందచేశారు. ఒకే ఒక దారి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమెకు వినతి పత్రం ఇచ్చిన వారిలో డాక్టర్ కోడూరుతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, బీజీ కృష్ణయాదవ్, ఆనందయాదవ్, బాలాజీ, హేమ, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుజిరీ వ్యాపారులకు నవజీవన్ ఫౌండేషన్ చేయూత

● కో-ఆర్డినేటర్ మారుతీ ప్రసాద్


గుజిరీ వ్యాపారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మారుతీ ప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లో గుజిరీ వ్యాపారాలు చేసుకొంటున్న వారికి నవజీవన్ ఫౌండేషన్ నమస్తే ప్రోగ్రామ్ ద్వారా చేయూతనిస్తామని ఆ సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మారుతీప్రసాద్ అన్నారు. స్థానిక బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం గుజిరీ వ్యాపారుల సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో గుజిరీ వ్యాపారాలు 150 మంది ఉన్నారన్నారు. వారికి చెత్త తరలించేందుకు వాహనాలు అందించేందుకు సహకరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుజిరీ వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాబక్ష్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

25న 'సిరాయ్' విడుదల


విక్రమ్ ప్రభు

తిరుమల శ్రీవారిని తమిళనటుడు విక్రమ్ ప్రభు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..తాను నటించిన 'సిరాయ్' చిత్రం ఈనెల 25న విడుదల కానున్న సందర్భంగా స్వామి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. మంగళవారం ఇంకా పలువురు ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. వారిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- 8 దుంగలు, కారు స్వాధీనం

మంగళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట- రైల్వేకోడూరు రహదారిలోని టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్ఐ వినోద్‌కుమార్, ఏఆర్ఎస్ఐ ఈశ్వరరెడ్డి బృందం మంగళవారం రేణిగుంట -రైల్వే కోడూరు రోడ్డులో ప్రకృతి బాట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 7గంటల సమయంలో వేగంగా వచ్చిన ఒక కారు టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్సు సిబ్బంది కారును సమీపించారు. దీంతో కారులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి పట్టుకోగలిగారు. కారులోని 8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. కారును, దుంగలను, నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

సర్వదర్శనానికి 10 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,142
తలనీలాలు సమర్పించినవారు: 26,619


పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మ


భేరివారిమండపం.. ముత్యాలమ్మ


జయరామరావువీధి.. కావమ్మ


బ్రాహ్మణవీధి.. నల్లగంగమ్మ


సన్నిధివీధి.. అంకాలమ్మ


గాంధీవీధి.. అంకమ్మ


కొత్తపేట.. భువనేశ్వరి

- శ్రీకాళహస్తి ప్రత్యేకం

నేడు ఏడుగంగల జాతర

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలకు ఏటి ఉత్సవాన్ని జాతర మహోత్సవంగా నిర్వహించడం మన సంప్రదాయంలో భాగం. తమను గంగమ్మతల్లి చల్లంగా చూడాలన్న సంకల్పంతో జాతరను వైభవంగా నిర్వహిస్తారు. జిల్లా అంతటా వేసవిలోనే గంగ జాతరలు జరుగుతుంటాయి. అందునా ఒకే గంగమ్మను కొలువుదీర్చుతారు. కానీ, శ్రీకాళహస్తి ప్రత్యేకత ఏంటంటే.. ఒకే రోజు ఏడు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహించడం. డిసెంబరులో.. వణికించే చలికాలంలో జాతర నిర్వహిస్తారు. ఏడు గంగమ్మలైన అక్కాచెల్లెళ్లు శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలిశారని పురాణోక్తి. వందలాది సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో ఏడుగంగల జాతర నిర్వహిస్తున్నారు. చారిత్రాత్మకంగా పరిశీలిస్తే జమిందారుల, సంస్థానాదీశుల సమయంలో శ్రీకాళహస్తి గ్రామానికి ఏడువైపులా గంగరాళ్లు (తెట్టురాళ్లు) ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. ఆయా గంగమ్మల వద్ద ఆయా ప్రాంతాల్లో ఏటా అమ్మవార్లను కొలువుదీర్చడం, ఒకేరోజు ఒకేసారి ఊరేగింపు, నిమజ్జనం జరగడం తరతరాలుగా వస్తోంది. అలాంటి ఏడు గంగల జాతర బుధవారం శ్రీకాళహస్తిలో వైభవంగా వైభవోపేతంగా జరగనుంది. మంగళవారం రాత్రి అమ్మవార్లకు ఏడుగంగమ్మల ఆలయం వద్ద పూజలు నిర్వహించాక ముసుగు తొలగిస్తారు. బుధవారం వేకువజామున భక్తులకు దర్శన భాగ్యం కల్పించాక పెండ్లి మండపం వరకు ఏడుగంగమ్మలను ఒకరి వెనుక ఒకరుగా ఊరేగింపుగా ఆయా ప్రాంతాలకు తీసుకొస్తారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులు ఏడు గంగమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీ రాత్రికి ఏడుగురు అమ్మవార్లను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ఒక్కొక్కరిని వరుసగా ప్రత్యేక పూజలతో నిమజ్జనం చేయడంతో జాతర ముగుస్తుంది.

స్క్రబ్‌టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వ్యాధి నివారణ, చికిత్సపై ఆరోగ్యశాఖ అధికారులతో మంగళవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్క్రబ్ టైఫస్ చిగ్గర్‌మైట్ అనే పురుగు ద్వారా వస్తుందని తెలిపారు. ఇది పొలాలు, గడ్డి ప్రాంతాలు, పశువుల పాక వంటి చోట్ల ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. కాటు వేసిన చోట నల్లమచ్చ ఉంటుందని, ఐదు రోజులకు మించి జ్వరం తలనొప్పి, ఒళ్లు నొప్పులుంటే చికిత్సలు పొందాలన్నారు. జిల్లాలో అనుమానిత కేసులు నమోదైన వెంటనే రాపిడ్ రెస్పాన్స్ టీం స్పందించి అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రాపిడ్‌టెస్టులు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ కోసం రుయా, స్విమ్స్‌కు పంపించాలని ఆదేశించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్‌వ్యాధి వ్యాప్తి నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడబోయి..

- నీట మునిగి ఆమెతో పాటూ ప్రాణాలు కోల్పోయాడు


మృతి చెందిన గుణశేఖర్ - అంకమ్మ

నారాయణవనం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని కాపాడబోయి.. చివరకు ఆమెతో పాటు ఆ వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన మంగళవారం నారాయణవనం మండలంలోని తిరువట్యం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరి మండలం గుండ్రాజుకుప్పానికి చెందిన గుణశేఖర్(42) తిరువట్యంలో తన బంధువు దహనక్రియలకు వచ్చారు. సాయంత్రం ఈయన ఇంటికి వెళ్తుండగా.. అదే సమయంలో తిరువట్యం కాజ్‌వే వద్ద నారాయణవనం రజక కాలనీకి చెందిన అంకమ్మ(72) దుస్తులు ఉతుకుతూ నీటిలో పడిపోయింది. దీనిని గమనించిన గుణశేఖర్ ఆమెను కాపాడేందుకు నదిలో దూకడంతో, ఊపిరాడక చనిపోయాడు. వృద్ధురాలూ మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్తుండగా ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఆటో
- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు


లావణ్య (ఫైల్‌ఫొటో)

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే వెళ్తే డాక్టర్ దగ్గర ముందుగానే చూపించుకుని తిరిగొచ్చేయచ్చని, తరువాత పనులకు వెళ్లొచ్చని బయలుదేరిన దంపతులు ప్రమాదానికి గురయ్యారు. భార్య అక్కడిక్కడే మృతి చెందగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన కోట మండలం చిట్టేడు, కేశవరం గ్రామాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. కోట మండలం గూడలి అరుంధతీయవాడకు చెందిన ధనరాశి మల్లికార్జున్, లావణ్య దంపతులకు వివాహమై 13 సంవత్సరాలు అవుతోంది. వీరికి పిల్లలు లేకపోవడంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయాన్నే డాక్టర్ దగ్గరకు వెళ్దామని మల్లికార్జున్, లావణ్య దంపతులు బైక్‌పై గూడూరుకు బయలుదేరారు. చిట్టేడు - కేశవరం గ్రామాల నడుమ వెళ్తుండగా గూడూరు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో లావణ్య(28) అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జున్ నడుం, భుజం, తలకు బలమైన గాయాలయ్యాయి. ఆటో నడుపుతున్న గూడూరుకు చెందిన అబ్బాస్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలికి చేరుకున్నారు. రోడ్డుపై ఉన్న లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మల్లికార్జున్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.


తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్

ముంపు బాధితులను ఆదుకుంటాం: కలెక్టర్

కేవీబీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు చెరువు ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కళత్తూరులో ముంపు బాధితులకు రూ.1.21 కోట్లు, రూ.42,20,000 కు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు మైక్ అందించి ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో చెప్పాలన్నారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న మురుగు వ్యవస్థను బాగు చేయించాలని, సిమెంటు రోడ్డు నిర్మించాలని, సిలిండర్లను పంపిణీ చేయాలని కోరారు. అన్నిటికంటే ముందు రాయలచెరువు కట్ట పటిష్టం చేయాలని, పాఠశాల భవనాలను బాగు చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 625 పశువులు మృతి చెందగా గేదెకు రూ.50వేలు, ఆవుకు రూ.40వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోళ్లకు రూ.100 చొప్పున పరిహారం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.4 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. రుణాల విషయంలో బ్యాంకర్లతో మాట్లాడి మహిళలకు ప్రత్యేక సహాయనిధిని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పొలాల్లో ఇసుక, మట్టి మేటలుంటే హెక్టార్‌కు రూ.18వేలు, కోతకు గురైతే ఎకరాకు రూ.18వేలను త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు పోగొట్టుకున్నవారికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి అందిస్తామన్నారు. విద్యార్థులు తాము చదువుకున్న విద్యా సంస్థల వివరాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, గోవర్ధన్, సాదు, థామస్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఏవో సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పశువులు, గొర్రెలు, మేకలు కోల్పోయిన వారికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నలుగురి అరెస్టు


నిందితులను మీడియా ముందు చూపుతున్న సీఐ మురళి

వరదయ్యపాళెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం లక్ష్మీపురంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను మంగళవారం ఉదయం మీడియాకు సీఐ మురళి వెల్లడించారు. ఆ ప్రకారం.. సీఎల్ఎన్ పల్లె మిట్ట హరిజనవాడలో గతనెల 30న గ్రామానికి చెందిన వంటమాస్టర్ హరి(33)ని దుండగులు హత్య చేసి పాడుబడిన ఇంట్లో పడేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జున్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. చెన్నై నుంచి అన్నదమ్ములు గౌతమ్, ప్రేమ్‌కుమార్ గ్రామంలో వచ్చి నివాసం ఉంటున్నారు. వారితో హరితో స్నేహంగా ఉండేవారు. గౌతమ్ స్థానికంగా ఏసీ పరిశ్రమలో పని చేస్తుండగా, ప్రేమ్‌కుమార్ జులాయిగా తిరిగేవాడు. ముగ్గురూ కలిసి మద్యం తాగేవారు. ఈ క్రమంలో మద్యం మత్తులో జరిగిన గొడవలో గౌతమ్, ప్రేమ్‌కుమార్ కలిసి హరిపై దాడి చేశారు. గమనించిన హరి బంధువులు, గ్రామస్తులు గౌతమ్, ప్రేమ్‌కుమార్‌ను హెచ్చరించారు. ఎక్కడినుంచో వచ్చి తమ గ్రామానికి చెందిన వ్యక్తిని ఎలా కొడతారంటూ తిట్టి పంపించారు. మీరేం చేయలేరంటూ హరి వారికి సవాల్ విసిరాడు. దీంతో అహం దెబ్బతిన్న గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని కడతేర్చాలని పథకం పన్నారు. కొద్ది రోజుల తరువాత హరితో ఎప్పటి లాగే సఖ్యంగా మెలిగారు. రోజూ హరికి మద్యం తాగించేవారు. గత నెల 30వ తేదీ హరి భార్య దేవసేన ఊరికి వెళ్లడంతో ఇదే సరైన సమయమని భావించిన గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని తమ ఇంటికి తీసుకెళ్లి ఫుల్‌గా మద్యం తాగించారు. అప్పటికే తమ ఇంట్లో హత్య కోసం చెన్నై నుంచి పిలిపించుకున్న మరో ఇద్దరు స్నేహితుల సహకారంతో గౌతమ్, ప్రేమ్‌కుమార్‌లు హరిని ఐరన్‌రాడ్, బండరాయితో హత్య చేశారు. హరి మృతి చెందాడని నిర్ధారించుకున్న తరువాత హత్యకు ఉపయోగించిన బండరాయిని, మృతుడిపై ఉన్న మరకలను శుభ్రంగా కడిగి, సమీపంలోని పాడుబడిన ఇంట్లో మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్‌ను, తాము ధరించిన దుస్తులను కాల్చి ఉబ్బలమడుగు సమీపంలోని నీటి కాలువలో కలిపేశారు. మృతుడి భార్య దేవసేన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఉబ్బలమడుగు క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులో తీసుకుని విచారణ చేయడంతో హత్యను చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. గౌతమ్, ప్రేమ్‌కుమార్‌తో పాటు చెన్నై థౌజండ్‌లైట్స్‌కి చెందిన జాన్‌పాల్ అలియాస్ జాన్, ఊటీకి చెందిన బెంజిమిన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్, బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ మల్లికార్జున్, సత్యవేడు రెండో ఎస్ఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను గుర్తించండి


టవర్‌క్లాక్ వద్ద దీక్షలో జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రజల ఆకాంక్షను గుర్తించి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి అన్నారు. పట్టణంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చేపట్టిన రిలే దీక్ష మంగళవారం నాటికి మూడో రోజుకు చేరింది. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు, ఆటో కార్మికులు, బీజేపీ నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని చెప్పారు. గూడూరుకు దగ్గరగా ఉండే నెల్లూరే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలను కోరారు. ఇదే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు స్థిరమైన ఉపాధి

- మంత్రి లోకేశ్ నిరంతర కృషి
- అమెరికా పర్యటన సత్ఫలితాలిస్తోందన్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన సత్ఫలితాలనిస్తోందన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే భాను కూడా ఉన్నారు. ఏపీని పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా పరిచయం చేస్తూ లోకేశ్ ప్రముఖ సంస్థలతో పలు కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సెమీకండక్టర్, కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా ప్రముఖ సంస్థలను లోకేశ్ ఆహ్వానించినట్లు వివరించారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతం, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలే అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు.


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

- పొగాకు పొడి చల్లి నగ లాక్కెళ్లిన

ఆటో డ్రైవర్ సహా ముగ్గురి అరెస్టు

- బంగారు గొలుసు, కత్తులు, ఆటో స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న తిరుపతి రూరల్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో ఆదివారం సాయంత్రం పొగాకు పొడి చల్లి, కొట్టి మహిళ మెడలో బంగారు నగ లాక్కెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రైల్వే కోడూరులోని శ్రీరామ్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కస్తూరి జయకృష్ణ, అదే ప్రాంతానికి చెందిన మాచినేని శిరీష, అన్నమయ్య జిల్లా రాజంపేట తాలూకా కొట్లపల్లికి చెందిన లింగుట్ల వెన్నెల మిత్రులు. వీరు చిన్నప్పటి నుంచి జులాయిగా తిరిగేవారు. చిన్న దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాలలో అటెండరుగా పనిచేస్తున్న మల్లిక డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లడానికి రోడ్డుపై నిలబడి ఉన్నారు. ఇంతలో పెరుమాళ్లపల్లి వైపు వెళుతున్న ఆటో వచ్చింది. ఆటోలో అప్పటికే ఇద్దరు మహిళలు ఉండటంతో ఆమె ధైర్యంగా ఎక్కారు. పథకం ప్రకారం ఆ ఇద్దరు మహిళలు ఆటో డ్రైవర్ సహాయంతో మల్లిక కళ్లలో పొగాకు పొడి చల్లి తలపై రాడ్డుతో కొట్టారు. ఆమె మెడలో వున్న బంగారు చైను లాక్కొని ఆటో నుంచి కిందకు తోసేసి పరారయ్యారు. దాడిలో బాధితురాలికి తలపై బలమైన గాయం కావడం, శరీరమంతా చిన్నపాటి దెబ్బలు తగలడంతో స్థానికులు రుయాలో చేర్పించారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు స్పందించి చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడుతున్న మొబైల్ ఫోన్ల ఆధారంగా వాళ్లున్న ప్రాంతాన్ని గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లోపల్లి జంక్షన్ వద్ద అయాన్ డిజిటల్ సమీపంలో నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి 24 గ్రాముల బంగారు చైను, దోపిడీకి ఉపయోగించిన కత్తులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని అత్యంత వేగంగా ఛేదించిన పోలీసు బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తిరుమలలో దుకాణాల పరిశీలన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యురాలు అనుగోలు రంగశ్రీ మంగళవారం తిరుమలలోని దుకాణాలను పరిశీలించారు. ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి ఆమె తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. అక్కడి దుకాణాల లైసెన్సులను స్వయంగా పరిశీలించారు. అనధికారికంగా ఎవరైనా దుకాణాలు నిర్వహిస్తున్నారా అని తనిఖీ చేశారు. అలాగే హాకర్ లైసెన్సులను కూడా చూశారు. టీటీడీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పలువురు దుకాణదారులకు సూచనలు చేశారు.


లైసెన్సులు పరిశీలిస్తున్న రంగశ్రీ

డివైడర్ ఢీకొన్న ఆటో

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు


గాయపడ్డ మహమ్మద్ అలీ, రహమాన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తిరుపతికి చెందిన మహమ్మద్ అలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఏడుగంగల జాతర కోసం తిరుపతి నుంచి పూలమాలలను తీసుకుని ఆటోలో కొడుకు అబ్దుల్ రహమాన్‌తో పాటు బయలుదేరారు. నాయుడుపేట- రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి పట్టణంలోకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు ఆరంభమయ్యే చోట ఆటో అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ఈ ఘటనలో వీరిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం క్షతగాత్రులను తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

హెల్మెట్ లేకుండా రోడ్డెక్కం



ద్విచక్ర వాహనదారుల చేత ప్రమాణం చేయిస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇకపై హెల్మెట్ ధరించే ద్విచక్ర వాహనాలను నడుపుతామని పలువురి చేత ఎస్ఐ శివశంకర్ ప్రమాణం చేయించారు. మంగళవారం రాపూరు - వెంకటగిరి జాతీయ రహదారిపై మార్లగంట వద్ద ఎస్ఐ శివశంకర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న యువకులకు అవగాహన కల్పించారు. ఇకపై హెల్మెట్ ధరించకుండా రోడ్డెక్కబోమని ప్రమాణం చేయించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాలకు వెళ్లి హెల్మెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద తొలగని నీరు

దారి లేక మినమనమూడి గ్రామస్తుల అవస్థలు



దొరవారిసత్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమనమూడి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరడంతో గ్రామస్తులు దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి నుంచి మినమనమూడి గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే గేట్‌ను తొలగించి అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి నీరు చేరింది. సమీపంలోనే రెండు రెండు పంట కాలువలు ఉండటంతో ఊట ఊరుతూ బ్రిడ్జి కింద నీరు తగ్గడంలేదు. దీంతో మినమనమూడి గ్రామానికి రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. రైల్వే అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జి కింద నీటిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అందరికీ యూరియా ఇవ్వండి

దామానెల్లూరు సొసైటీ సీఈవోతో రైతుల వాగ్వాదం



దామానెల్లూరు సొసైటీ వద్ద రైతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో వివక్ష లేకుండా అందరికీ అందజేయాలని రైతులు కోరారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మంగళంపాడు, దామానెల్లూరు, రాచంద్రగుంట, ఉగ్గుముడి, మతకాముడి, వెలగలపొన్నూరు గ్రామాలకు చెందిన రైతులు యూరియా తీసుకునేందుకు దామానెల్లూరు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. తొలి విడత పంటలు వేసే రైతులకు ముందుగా ఇస్తామని, మంగళంపాడు గ్రామ రైతులకు తరువాత ఇస్తామని అక్కడున్న నాయకులు చెప్పడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీలో పాలకవర్గం కాకుండా సంబంధం లేని నాయకులు యూరియా పంపిణీ విషయంలో జోక్యం చేసుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదంటూ సీఈవో రామయ్యతో వాగ్వాదానికి దిగారు. దీంతో సొసైటీ సిబ్బంది యూరియా పంపిణీని నిలిపివేశారు. సమాచారం తెలుసుకున్న వ్యవసాయాధికారిని కాంచన అక్కడకు చేరుకుని రైతులకు నచ్చచెప్పి ఉన్న అవసరమైన రైతులకు యూరియాను అందజేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

బాల్య వివాహాలతో అనర్థాలు

నాయుడుపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల అనర్థాలు జరుగుతాయని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ విజయకుమార్ అన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డీఆర్ వాసప్ప, ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ఎదగని వయస్సులో వివాహాలు చేస్తే శారీరక రుగ్మతలు వస్తాయని చెప్పారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి యాదవ్, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, వీరాస్వామి, ఎన్‌సీసీ కెప్టెన్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి క్రిస్టి మనోహర్



నాయుడుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు నాయుడుపేట క్రీడాకారుడు క్రిస్టి మనోహర్ ఎంపికైనట్లు కోచ్ గౌస్‌బాషా తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో నాయుడుపేట బేరిపేటకు చెందిన క్రిస్టి మనోహర్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 11 నుంచి హర్యానా రాష్ట్రం పానిపట్టు జిల్లాలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో క్రిస్టి మనోహర్ పాల్గొంటాడని చెప్పారు.

ఇంధన పొదుపుపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మృదుల, పక్కన డీఈ శేఖర్ తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. విద్యుత్‌శాఖ డీఈఈ శేఖర్ ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని 9, 10 తరగతుల విద్యార్థులకు వకృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మృదుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

డిగ్రీ కళాశాలలో...

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంధన పొదుపు ఆవశ్యకత తెలిపేందుకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

నేడు డక్కిలిలో ప్రజాదర్బార్

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్‌కు సన్మానం

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్‌ను సూళ్లూరుపేట పట్టణ జనసేన అధ్యక్షుడు పొన్నా కాటయ్య, టీడీపీ నాయకులు వేనాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాఘవేంద్ర, సీతారాముల దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కారంశెట్టి మల్లికార్జునశర్మ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్‌ను పూలమాలవేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న కాటయ్య, ప్రవీణ్‌రెడ్డి తదితరులు





మగ్గం గుంటలోకి చేరిన నీరు - వర్షాలకు పాడైన పట్టు, పడుగు. జరీ వస్తువులు

ఆపన్న హస్తం కోసం నేతన్నల ఎదురుచూపులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో పట్టు, పడుగు, జరీ వంటి వస్తువులు పూర్తిగా తడిచిపోయి పనికిరాకుండా పోయాయని నేతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న నేత కార్మికులకు దిత్వా తుఫాను కారణంగా కురిసిన వర్షాలు మరింత నష్టం మిగిల్చాయి. గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో సుమారు 250కు పైగా చేనేత కుటుంబాలు ఉన్నాయి. అక్టోబరులో మొంథా, ఈ నెలలో దిత్వా తుఫాన్ల కారణంగా భారీ వర్షాలు కురవడంతో మగ్గం గుంటల్లోకి నీరు చేరింది. పట్టు, నూలు, పడుగు, జరీ వంటి వస్తువులు పూర్తిగా తడిచిపోయి పనికిరాకుండా పోవడంతో ఒక్కో చేనేత కార్మికుడికి సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు నష్టం వాటినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా రెండు నెలలుగా పనులు లేక పోవడంతో జీవనోపాధి లేకుండా పోయి పూట గడవడమే ఇబ్బందికరంగా మారిందని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేసిందన్నారు. చెన్నూరులో ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిచిపోయిన పట్టు, పడుగు వస్తువుల నష్టాన్ని అంచనా వేసి సాయం అందించడంతో పాటు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.



పాడైపోయిన నూలు కండెలను చూపుతున్న చేనేత కార్మికులు

ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం: కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. మంగళవారం ఆయన బంగారుపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపీ, మందుల గది, రక్త పరీక్షల విభాగంతో పాటు ప్రసూతి వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో వసతులు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు రెండు నెలలకోసారి ప్రభుత్వాస్పత్రులను సందర్శించి వైద్య సేవల నాణ్యతను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

బాలాయపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ సంఖ్య, మందుల కొరత, ఇతర సమస్యలపై ఆరా తీశారు. సిబ్బంది కొరత ఉందని, వర్షం కురిస్తే ప్రసూతి గది ఉరుస్తుందని వైద్యాధికారి లిఖిత వివరించారు. ఎమ్మెల్యే ప్రసూతి గదిని పరిశీలించారు. ఆస్పత్రిలో అదనపు భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. సిబ్బంది కొరత గురించి డీఎం అండ్ హెచ్‌వోతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడు, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు ఆది వెంకటకృష్ణారెడ్డి ఉన్నారు.



బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యురాలితో మాట్లాడి ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ గడియారం సెంటర్ వద్ద పోలేరమ్మ ఆలయం ఎదుట ఇనుప టేబుల్‌ను ఢీకొన్న సంగతి తెలిసిందే. ఆ బస్సును సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ షేక్ హుమయూన్, పాఠశాల వాహనాల ఇన్‌చార్జి సుధీర్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పాఠశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీపురం రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - శ్రీపురం తారురోడ్డు నిర్మాణానికి సాస్కీ పథకం ద్వారా రూ.1.30 కోట్లు నిధులు మంజూరైనట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి తెలిపారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీఎస్ రోడ్డు ప్రాంతానికి చెందిన సాయిరాం కాలేయ, మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం బాలాజీ నగర్‌లోని ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, కుమార్, పెంచలయ్య, కృష్ణారెడ్డి, వెంకట్రావు, విజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న జేవీవీ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో మనపాటి శ్రీనివాసరావు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చలపతి, నాగరాజు, రామ్మోహన్‌రావు, పురుషోత్తమరావు, పవన్, సుబ్బారావు, ప్రభాకర్, రజనీకాంత్, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎల్‌డీవో జాలిరెడ్డి చేతుల మీదుగా దివ్యాంగులకు దుస్తులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ కార్యదర్శి ఆదిశేషారెడ్డి, అధ్యక్షురాలు లలిత, ఎంపీడీవో మురళీకృష్ణ, దివ్యాంగుల నాయకురాలు నాదెండ్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మన్నారుపోలూరులో ఉచిత వైద్య శిబిరం

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు సచివాలయ ఆవరణలో మంగళవారం నెల్లూరు నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్ల, ఎముకలు, చర్మ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్థానికులు పామూరు మునస్వామి, ఆవుల శ్రీనివాసులు, బండ్ల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కండి



టీడీపీ నాయకులతో సమావేశమైన పార్టీ పరిశీలకులు

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థ ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సంసిద్ధులు కావాలని పార్టీ పరిశీలకులు దాసరి అంకయ్య, పాలేటి అంకయ్య కోరారు. మంగళవారం డక్కిలి, వెంబులూరు, సంగనపల్లిలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి దుగ్గి వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు పోకూరు రమేష్ నాయుడు, పాయశం గోపాల్, చెంచయ్య యాదవ్, సర్వేపల్లి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక నిప్పో పరిశ్రమ సమీపంలో చెన్నై వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి నడుచుకొని వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభ్యంకాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

ఘనంగా ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తడకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హరిత, జనవిజ్ఞానవేదిక నాయకులు చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంఈవో సునీలా అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మన్నారుపోలూరు ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, స్వరూప, సుమల, హరి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సునీల, పక్కన ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో 63 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ రూ.42.71 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే విజయశ్రీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడుపేట, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, నాయకులు కందల కృష్ణారెడ్డి, రఫీ,అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, నిత్యకృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, సుబ్బారావు, మైలారి రాజశేఖర్, పొట్లపూడి రాజేష్, అవధానం సుధీర్, విజయకుమార్ నాయుడు, అంకయ్య, జీవీఆర్ నాయుడు, అన్నమనేని సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యురాలు, ఎంపీ నియాగాంధీ 79వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లుపంచిపెట్టారు. అన్నదానం చేవారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతున్న ఏకైక కుటుంబం గాంధీ కుటుంబమన్నారు. సురేంద్రరెడ్డి, గోపాలరావు, నవీన్, రాహుల్, నాగరాజు, మహేష్, సాయి, సారథి, బాబు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించండి



కేవీబీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యతగా పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. మంగళవారం కళత్తూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన పౌష్టికాహారాన్ని వారితో కలిసి భోంచేశారు. భవనానికి తాను మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ప్రథమ చికిత్స కిట్ల అందజేత



శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకు తిరుపతికి చెందిన డీబీఆర్ అండ్ ఎస్కే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు మంగళవారం 108 ప్రథమ చికిత్స కిట్లను అందించారు. వీటిని డిపో మేనేజరు రేవతి అందుకున్నారు. ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. వాటిని డ్రైవర్లకు అందించారు. అసిస్టెంట్ మేనేజరు చిట్టెమ్మ, అసిస్టెంట్ ఇంజనీరు చక్రవర్తి, అసోసియేషన్ నాయకులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

కౌశల్ క్విజ్‌లో విద్యార్థులకు బహుమతులు



ఏర్పేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కౌశల్ క్విజ్, రీల్స్‌లో ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు. తిరుపతి డీఈవో కార్యాలయంలో జరిగిన రీల్స్, క్విజ్ పోటీల్లో రీల్స్ విభాగంలో పి.ధను, క్విజ్ పోటీల్లో జాషువా ప్రథమ స్థానంలో నిలిచారు. డీఈవో కేవీఎన్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. జాషువా ఏర్పేడు బీసీ వసతిగృహంలో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు.

ఆదర్శ సమాఖ్యలుగా ఎదగండి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు సమాఖ్యలు ఆదర్శంగా ఎదగాలని వెలుగు ఎంపీఎం మునెయ్య తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు కార్యక్రమం ప్రారంభించి 25 సంవత్సరాలు అయ్యిందని, మహిళలు ఎన్నో ప్రయోజనాలతో పాటు అనేక విజయాలు సాధించారని తెలిపారు. లక్ష్యం ఏర్పాటు చేసుకుని గమ్యం చేరుకోవాలని పిలుపునిచ్చారు. సీసీలు వెంకటరత్నం, జీవా, వీరజిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును కలిపేలా చర్యలు తీసుకోండి

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని గత వైసీపీ ప్రభుత్వం తిరుపతి జిల్లాలో కలపడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి చాలా దూరంగా ఉండడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే దూరం కావడంతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోండి

నారాయణవనం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో అచీవర్స్ కమ్యూనిటీ, ఫౌండర్స్ ఫోరం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలు, స్టార్టప్ అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించే ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఎమర్జింగ్ టెక్నాలజీ రంగాల్లో భవిష్యత్తు అవకాశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జనార్దన రాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి

సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఏర్పేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల పంచాయతీలో మంగళవారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎల్ కంపెనీ నుంచి వికృతమాల వెళ్లే మార్గంలో రోడ్డు మొంథా, దిత్వా తుఫానుల కారణంగా కురిసిన వర్షాలతో గుంతలమయమైంది. ఈ మార్గంలో గ్రామస్తులు ప్రయాణించలేకపోతున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లగా 220 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించారు. ఈ క్రమంలో మంగళవారం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.



టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచే టీడీపీ బలోపేతం లక్ష్యంగా పని చేద్దామని వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలంలోని 197, 199, 201, 203, 211, 229 బూత్‌ల పరిధిలో తాను పరిశీలకుడిగా వెళ్లినట్లు తెలిపారు. ఆ బూత్‌లకు సంబంధించి వివరాలను సేకరించి లోటు పాట్లను, టీడీపీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు కోట చంద్రశేఖర్, పార్తిబన్, కుమార్, రుద్రయ్య, చాంద్‌బాషా, మధు తదితరులు పాల్గొన్నారు.


మిన్నల రవిని సత్కరిస్తున్న నాయకులు

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర శిక్ష తిరుపతి జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయుడు ఆదేశించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం టెన్త్ పబ్లిక్ పరీక్షల వంద రోజుల ప్రణాళిక కార్యక్రమ తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... లక్ష్యాన్ని నిర్దేశించుకుని నూరురోజుల ప్రణాళికను క్రమశిక్షణతో పాటిస్తే వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. నూరురోజుల ప్రణాళికను అమలు తీరుపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఎంఈవో బాలయ్య, సమగ్ర శిక్ష ఏపీవో డాక్టర్ సుధాకర్, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న ఏఎంవో చంద్రశేఖర్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): టీచ్ టూల్ శిక్షణతో విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేయవచ్చని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీచ్ టూల్‌పై 60 మంది ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను తరగతుల్లో బోధించాలన్నారు.

పుత్తూరు వార్తలు

వాహన ఫిట్‌నెస్ కేంద్రాన్ని కొనసాగించండి

- జిల్లా రవాణాశాఖాధికారికి విజయ్‌బాబు వినతి

పుత్తూరు అర్బన్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పుత్తూరులోనే వాహన ఫిట్‌నెస్ కేంద్రాన్ని కొనసాగించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పుత్తూరులో ఉన్న కేంద్రాన్ని బంగారుపాళ్యంకు తరలిస్తే ఆటో, ట్రాక్టర్, లారీ, బస్సు తదితర వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు వాహన ఫిట్‌నెస్ కోసం దాదాపు 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రజల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వాహన ఫిట్‌నెస్ కేంద్రాన్ని పుత్తూరులో కొనసాగించాలని కోరారు. అంతకుముందు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడినట్లు విజయబాబు తెలిపారు. మంత్రి కూడా పుత్తూరులోనే వాహన ఫిట్‌నెస్ కేంద్రం కొనసాగించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.


జిల్లా రవాణాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌బాబు

బీపీఎస్ పథకానికి సాంకేతిక ఇబ్బందులు

- ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా రూ.40 లక్షల ఆదాయం
- అధికారులు చొరవ తీసుకుంటే ప్రజలకు ఉపయోగం



పుత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా అమల్లోకి తెచ్చిన బీపీఎస్ పథకం సాంకేతిక ఇబ్బందులతో సమస్యాత్మకంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. గత నెల 23వ తేదీన బీపీఎస్ పథకాన్ని ప్రకటించగా ఇప్పటి వరకు ఒక్క ఫైల్ కూడా నమోదు కాలేదు. పేమెంట్ ఆప్షన్ విషయంలో సాంకేతిక సమస్య నెలకొంది. దీంతో దరఖాస్తు అప్‌లోడ్ కావడం లేదు. దాదాపు పుత్తూరులో 50 మందికి పైగా బీపీఎస్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ దరఖాస్తులు కూడా పట్టణ ప్రణాళిక విభాగం లైసెన్స్‌దారుల వద్ద ఉన్నాయి. అంతేకాకుండా పుత్తూరు టీపీవో నీరజాక్షి ఇటీవల పదోన్నతిపై బదిలీ అయ్యారు. కాగా, ఆ అధికారి లాగిన్ మార్పు చేయకపోవడంతో కూడా బీపీఎస్ దరఖాస్తులు అప్‌లోడ్‌కు ఆటంకంగా మారింది. ఆ సమస్య గత రెండు రోజుల క్రితం పూర్తి కాగా, సాంకేతిక సమస్య నేటికీ కొనసాగుతోంది. మార్చి 12వ తేదీ వరకు బీపీఎస్‌కు గడువు ఉన్నప్పటికీ ఒక్కసారిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయడంతో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. ఈ అంశంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. సమస్య త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఎల్ఆర్ఎస్ అంశంలో ఇప్పటికే పుత్తూరు మున్సిపాలిటీకి దాదాపు రూ.40 లక్షల ఆదాయం చేకూరింది. ఎల్ఆర్ఎస్‌ను ఆగస్టు 4వ తేదీ నుంచి అక్టోబర్ 24 వరకు గడువు ఇవ్వగా, మరో మూడు నెలలు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలు అమలవుతున్నా.. ఆమోదించే అధికారి పుత్తూరు మున్సిపాలిటీలో కరువయ్యారు. టీపీవో స్థానం ఖాళీగా ఉండటం, ఆ అధికారాన్ని ఏఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలను లబ్ధిదారులకు వర్తింపచేసేందుకు చొరవ తీసుకోవాల్సి ఉంది.

ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై శిక్షణ

నారాయణవనం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ సహాయకులను టార్గెట్ ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ రామకృష్ణ.. ఫోర్టిఫైడ్ బియ్యం, ఉప్పు, నూనె, పాలుపై అవగాహన కల్పించారు.

ఏడు గంగమ్మలకు ముక్కంటి సారె




స్వామిఅమ్మవార్ల వద్ద సారెకు ప్రత్యేక పూజలు - సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే సుధీర్, కొట్టే సాయిప్రసాద్ తదితరులు - సారె ఊరేగింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో మంగళవారం ఏడుగంగమ్మల అమ్మవార్లకు ముక్కంటి సారెను ఎమ్మెల్యే సుధీర్ అందజేశారు. ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులు, ఆలయ పాలకమండల అధ్యక్షుడు సాయిప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ దంపతులు సారెను తీసుకుని బయలుదేరారు. ఆలయంలోని శివయ్య గోపురం నుంచి రాజగోపురం, తేరువీధి, నెహ్రూవీధి, ముత్యాలమ్మ గుడివీధి మీదుగా వెళ్లి ఏడుగంగమ్మలకు సారె సమర్పించారు. ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు కాసరం రమేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు - ప్రత్యేక అలంకారంలో ఏడుగంగమ్మల అమ్మవారు - ఆలయ అర్చకులకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే

నేడు ఏడుగంగమ్మల జాతర

శ్రీకాళహస్తిలో సర్వత్రా సందడి




సిద్ధమవుతున్న పెండ్లిమండపం - ముస్తాబవుతున్న గాంధీవీధి గంగమ్మ, సన్నిధివీధి గంగమ్మ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వేడుకగా జరగనుంది. ఎక్కడైనా ఒక అమ్మవారికి వేసవిలో జాతర జరుగుతుంది. కానీ శ్రీకాళహస్తిలో ఏడుగురు అమ్మవార్లకు డిసెంబరులో పట్టణంలోని ఏడు ప్రాంతాలకు చెందిన గంగమ్మలు ఒకే చోటుకు చేరి ఊరేగింపుగా సాగడం తిరిగి మళ్లీ అందరూ అమ్మవార్లు ఒకే చోటుకు చేరి నిమజ్జనం జరగడం వాయులింగేశ్వరుడు కొలువైన క్షేత్రంలో సంబరంగా సాగుతుంది.

శ్రీకాళహస్తి పట్టణంలోని పెండ్లిమండపం, భేరివారి మండపం, సన్నిధివీధి, బ్రాహ్మణవీధి, పూసలవీధి, గాంధీవీధి, కొత్తపేట ప్రాంతాల్లో ఏడుగంగమ్మల అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సిద్ధం చేస్తారు. ఆదివారం అర్ధరాత్రి ఏడుగురు అమ్మవార్లు కొలువైయే ప్రాంతాల్లో చాటింపుతో జాతరకు అంకురార్పణ జరిగింది. బుధవారం జరిగే జాతరకు మూడు రోజుల ముందు నుంచే అమ్మవారు కొలువు తీరే ప్రాంతాల వద్ద చలువ పందిల్లు, విద్యుత్ దీపాలంకరణలు సుందరంగా రూపొందించారు. బుధవారం వేకువజామున ఆయా ప్రాంతాల నుంచి అమ్మవారి ఉత్సవమూర్తులు సర్వాలంకార భూషితులై శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల అమ్మవారి వద్దకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే యువత ఉత్సాహంగా చిందులువేశారు. ఏడుగంగమ్మల ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏడుగురు అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ముసుగు తొలగింపుతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అక్కడి నుంచి అమ్మవార్లు పెండ్లిమండపం వరకు ఏడుగంగమ్మలు ఒకరి వెనుక ఒకరు అనుసరిస్తూ ఊరేగింపు జరిగింది. పట్టణంనుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు జాతర ఊరేగింపులో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. పెండ్లి మండపం నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడికి ఊరేగింపుగా చేరుకుని ఉదయం 9గంటల సమయానికి కొలువుదీరుతారు. రాత్రి మళ్లీ ఏడు గురు అమ్మవార్లు పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుంటారు. శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ మళ్లించినట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. అన్ని భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా బైపాస్ మీదుగా మళ్లిస్తామన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా పోలీసు అధికారులు భారీ బందోబస్తుతో పాటు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లా నలు మూలల నుంచి పోలీసు అధికారులు, సిబ్బందిని రప్పించి ఒకరోజు ముందు నుంచే బందోబస్తు విధులు కేటాయించారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు


ప్రసాదం పంపిణీలో కొట్టే సాయిప్రసాద్ తదితరులు

ఆధార్ కేంద్రం ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. ఎంఈవో రవీంద్రనాథ్, ఆధార్ నిర్వాహకుడు చెంచురత్నం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసి ఏర్పాట్లపై చర్చించారు. గిరిజన కాలనీలకు చెందిన పిల్లలకు ఆధార్ లేకపోవడంతో పాటు ఉన్నవారి ఆధార్‌లోని తప్పులను సరిచేసుకోలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో ఐటీడీఏ అధికారులు ఆధార్ నమోదు కేంద్రాన్ని మండలంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ



శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..17 మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. అంజూరు శ్రీనివాసులు, వి.కృష్ణారెడ్డి, సిరాజ్‌బాషా, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దాసుకుప్పం పంచాయతీని విభజించొద్దు

సత్యవేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పం పంచాయతీని రెండుగా విభజించడానికి మెజార్టీ వార్డు సభ్యులు, ప్రజలు వ్యతిరేకించారు. మంగళవారం దాసుకుప్పం సచివాలయం ప్రాంగణంలో సర్పంచు రవిరెడ్డి అధ్యక్షతన, డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. దాసుకుప్పం పంచాయతీలో ఆవాస గ్రామంగా ఉన్న చెన్నేరిని ప్రత్యేక పంచాయతీ చేయాలన్న చెన్నేరి ప్రజల డిమాండ్ మేరకు ఇక్కడి అధికారులు ప్రతిపాదనలను జిల్లా అధికారులకు ఇది వరకే పంపారు. కానీ దాసుకుప్పం పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ పంచాయతీ ప్రజలు అభ్యంతరాలను జిల్లా అధికారులకు అందించారు. ఈక్రమంలో దాసుకుప్పం విభజనకు సంబంధించి గ్రామసభ నిర్వహించి నివేదికను పంపించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో అధికారులు గ్రామసభ ఏర్పాటు చేశారు. 12 మంది వార్డు సభ్యుల్లో 9 మంది వ్యతిరేకత వ్యక్తం చేశారు. పైగా దాసుకుప్పం, చెన్నేరి రెండూ ఒకే పంచాయతీలో కొనసాగాలంటూ తీర్మానించారు. దీంతో పాటు దాసుకుప్పం పంచాయతీ విభజనపై స్థానికులు కూడా వ్యతిరేకించారు. దాసుకుప్పం పంచాయతీగా కొనసాగాలని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడడం, వార్డు సభ్యులు తీర్మానాలు ఆమోదించినట్లు ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నివేదిక కూడా పంపిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి జ్ఞానప్రకాష్, స్థానిక నాయకులు ఏ.వి.ఎం.బాలాజీరెడ్డి, సుందరరామిరెడ్డి, లోకయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దాసుకుప్పంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

బొల్లి తిప్పగుట్టలో మట్టి తవ్వితే నాన్‌బెయిలబుల్ కేసులు

పిచ్చాటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు పంచాయతీ అద్దాలమేడ సమీపంలోని బొల్లి తిప్పగుట్ట నుంచి కొందరు అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారని వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానికంగా కొందరు రాజకీయ నాయకుల అండదండలతో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వి తరలిస్తున్నారని చెప్పారు. ఇకపై గ్రావెల్ తవ్వకాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ గుట్ట పూర్తిగా తేమ బీడు పోరంబోకు అని, ఇక్కడ పశువుల మేత తప్ప ఇతర మైనింగ్‌లకు అనుమతి లేదన్నారు.

బాలిక అదృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలిక(17) అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాలికతో పొరుగు గ్రామానికి చెందిన యువకుడు సన్నిహితంగా ఉండేవాడని రెండు రోజుల నుంచి ఇద్దరు కనబడడం లేదని కుటుంబసభ్యులు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయకుండా పోలీసులు జాప్యం చేయడంతో బాలిక కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో బాలిక అదృశ్యమైనట్లు రాత్రి కేసు నమోదు చేశారు. ఆ వెంటనే యువకుడితో పాటు బాలికను పోలీసులు శ్రీకాళహస్తికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

క్రీడలతో మానసికోల్లాసం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాలతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం వస్తుందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. బీఎన్‌కండ్రిగలోని మైదానంలో ఎంపీడీవో, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను ప్రారంభించారు.